RNI No.: TELTEL/2023/90269

# తెలంగాణ షాన్

ప్రతి పదం ప్రజల పక్షం

తెలుగు దిన పత్రిక

# TELANGANA SHAAN

Telugu Daily

విలేకరులు కావలెను
తెలంగాణ షాన్
తెలుగు దినపత్రిక
నందు రెండు తెలుగు రాష్ట్రాలలో
జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు
నియోజకవర్గ ఇన్చార్జ్‌లు
మండలాల వారిగా విలేకరులు కావలెను
ఆసక్తి గల యువతీ యువకులు
సంప్రదించవలసిన మొబైల్
నెంబర్: 99637 08331

| Malkajgiri | Volume: 3 | Issue: 297 | Sunday, March 15, 2026 | Editor: RAMANCHARLA SRIKANTH | Pages: 4 | Rs. 4/- |
|---|---|---|---|---|---|---|
| మల్కాజిగిరి | సంపుటి : 3 | సంచిక : 297 | ఆదివారం, మార్చి 15, 2026 | ఎడిటర్: రామన్‌చర్ల శ్రీకాంత్ | పేజీలు : 4 | వెల : రూ.4 /- |

# కాంగ్రెస్ భయాందోళనలు సృష్టిస్తుంది: ప్రధాని మోడీ



**సిల్చార్:** ప్రధాని నరేంద్ర మోడీ మరోసారి కాంగ్రెస్ పై ఫైరయ్యారు. పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ వాతావరణం నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ దేశంలో ఆందోళనలు సృష్టిస్తోందని ప్రధాని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసోంలోని సిల్చార్ పట్టణంలో శనివారం ప్రధాని మోడీ రూ. 23,550 కోట్ల విలువైన ప్రాజెక్టులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ప్రధాని మాట్లాడుతూ.. ప్రపంచం యుద్ధాలను ఎదుర్కొంటుందని.. కేంద్ర ప్రభుత్వం యుద్ధ ప్రభావాన్ని తగ్గించడానికి ప్రయత్నిస్తుంటే.. కాంగ్రెస్ భయాందోళనలు సృష్టించేందుకు ప్రయత్నిస్తుందని మండిపడ్డారు. క్లిష్ట పరిస్థితుల్లో బాధ్యతాయుతమైన పార్టీగా వ్యవహరించడంలో విఫలమైందని అన్నారు. ఈశాన్య ప్రాంతాన్ని కాంగ్రెస్ విస్మరించిందని.. అస్సాం యువతను హింస, ఉగ్రవాదం వైపు తప్పుదారి పట్టించిందని విమర్శించారు. 'ఇవాళ ప్రపంచవ్యాప్తంగా యుద్ధ పరిస్థితులు నెలకొన్నాయి. దేశ ప్రజలపై ఆ ప్రభావం తగ్గించడానికి ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేస్తోంది. వారి రక్షణ, శ్రేయస్సుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో బాధ్యతాయుత ప్రతిపక్షంగా కాంగ్రెస్ వ్యవహరిస్తుందని ఆశిస్తాం. అయితే దేశ ప్రయోజనాల పరిరక్షణలో కాంగ్రెస్ మరోసారి విఫలమైంది. దేశంలో భయాందోళనలు సృష్టించేందుకు ప్రయత్నిస్తోంది. మోదీని దూషించడమే పనిగా పెట్టుకుంది. అంతర్జాతీయంగా భారత్ శీఘ్ర అభివృద్ధిని సాధించడం కొన్ని శక్తులకు ఇష్టంలేదు. అలాంటి శక్తుల చేతిలో కాంగ్రెస్ కీలుబొమ్మగా మారింది' అని మోదీ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు.

**విజన్ లేని కాంగ్రెస్**

కాంగ్రెస్ పార్టీకి అస్సాం గురించి కానీ, దేశం గురించి కానీ ఎలాంటి విజన్ లేదని మోదీ తప్పుపట్టారు. మోదీని దూషించడం, అబద్ధాలు, వదంతుల ప్రచారంతో ప్రజలను తప్పుదారి పట్టించడమే ఆ పార్టీకి తెలుసునని అన్నారు. బీజేపీ ప్రభుత్వం యువతకు అనేక అవకాశాలు కల్పించిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఆలోచనలు ఎక్కడ ఆగిపోతాయో, అక్కడి నుంచే తమ పని ప్రారంభమవుతుందని, అభివృద్ధిలో వెనుకబడిన వారికి ప్రాధాన్యత ఇవ్వడమే బీజేపీ ప్రధాన మంత్రమని చెప్పారు.

## మొజ్తాబా ఖమేనీ ఆచూకీ కోసం అమెరికా

# రూ.93 కోట్లు ఆఫర్



ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ ఎక్కడున్నారన్న సమాచారం చెప్పే వారికి 10 మిలియన్ డాలర్లు (భారత కరెన్సీలో దాదాపు రూ. 93కోట్లు )ఇస్తామని అమెరికా భారీ ఆఫర్ ప్రకటించింది. ఈమేరకు యూఎస్ విదేశాంగశాఖ ఎక్స్‌లో ప్రకటన చేసింది. సుప్రీం నేత ఖమేనీతోపాటు ఆయన కార్యాలయ డిప్యూటీ చీఫ్ ఆలీ అస్గర్ హెజాజీ, ఇరాన్ భద్రతాధికారి అలీ లారిజాని సహా పలువురి పేర్లను యూఎస్ విదేశాంగశాఖ ప్రస్తావించింది. వీరు ప్రపంచ వ్యాప్తంగా ఉగ్రవాదాన్ని ఎగదోస్తున్నారని ఆరోపించింది. వీరికి సంబంధించిన సమాచారం ఉంటే ఎన్‌క్రిప్టెడ్ మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ లేదా టోర్ నెట్‌వర్క్ ద్వారా తెలియజేయాలని పేర్కొంది. ఇందుకు తగిన బహుమతి ఇస్తామని, సమాచారం అందించినవారికి పునరావాసం కల్పిస్తామని వెల్లడించింది. అమెరికాఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్ సుప్రీం నేత ఆయతుల్లా అలీ ఖమేనీ మృతి చెందిన తరువాత ఆయన వారసుడిగా మొజ్తాబా ఎన్నికయ్యారు. అయితే మొజ్తాబా ఇప్పటివరకు ఎక్కడున్నారనే విషయంపై స్పష్టత లేదు.

## మాట ఇచ్చాం.. పనులు చేస్తాం..

# గిరిజనులకు పవన్ కల్యాణ్ భరోసా



**అమరావతి:** ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధి, గిరిజన హక్కుల పరిరక్షణే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. పాడేరు నియోజకవర్గం నందిగరువు గ్రామంలో శనివారం నిర్వహించిన 'గిరిజనులతో మాటామంతి' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని, 'డోలి మోత'లతో ఇబ్బందులు పడుతున్న మారుమూల గ్రామం నుంచి మార్పు మొదలు కావాలని, అందుకే ఈ కార్యక్రమాన్ని ఇక్కడ ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. 'సమస్యలు ఏవైనా రాత్రికి రాత్రే పరిష్కారం కావు. కానీ పరిష్కరించాలనే సంకల్పం మాకుంది. ప్రధానమంత్రి నిధులతోనే ఈ ప్రాంతంలో రోడ్ల నిర్మాణం సాధ్యమైంది. గత ప్రభుత్వంలో ఈ నిధులు ఏమయ్యాయో మీరు నాయకులను నిలదీయాలి. మారుమూల ఏజెన్సీ ప్రాంతాల్లో ఇప్పటికే 460 కిలోమీటర్ల మేర రహదారులు నిర్మించాం. పార్టీలతో సంబంధం లేకుండా నిధులు కేటాయిస్తున్నాం. నాయకులకు ఈ ప్రాంతాలకు రావాలంటేనే భయం. కానీ, నేను ప్రజల కోసం పనిచేసే వ్యక్తిని కాబట్టి ఎవరికీ భయపడను.

మీ సమస్యలు తెలుసుకోవడానికి ముందుకు వచ్చానని' ఆయన అన్నారు. నందిగరువు గ్రామస్తుల విన్నపం మేరకు కొత్త పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, 1.6 కిలోమీటర్ల మేర నూతన రోడ్డు నిర్మాణంతో పాటు గ్రామంలో మ్యాజిక్ డ్రైన్లు మంజూరు చేశారు. అలాగే, సుమారు 3 వేల గ్రామాలకు తాగు నీరు అందించే బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టబోతున్నట్లు డిప్యూటీ సీఎం వెల్లడించారు. గిరిజన ప్రాంతాల్లో ఉపాధికి కీలకమైన జీవో నెంబర్ 3 పునరుద్ధరణపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో చర్చించి సానుకూల నిర్ణయం తీసుకుంటామని భరోసా ఇచ్చారు.

# బ్లాక్ మార్కెటింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవు : మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**హైదరాబాద్, మార్చి 14:** గ్యాస్ సిలిండర్ల సరఫరాలో ఏర్పడిన సమస్యలపై రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో గృహ వినియోగ గ్యాస్ సిలిండర్లకు ఎలాంటి కొరత లేదని స్పష్టం చేశారు. అయితే కమర్షియల్ సిలిండర్ల సరఫరాలో కొంత ఇబ్బంది ఉన్నట్లు వెల్లడించారు.

ఇవాళ ఎల్‌పీజీ డిస్ట్రిబ్యూటర్లు, ఆయిల్ కంపెనీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి పరిస్థితిని సమీక్షించినట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రంలో గ్యాస్(ట్రా+) సరఫరాను పర్యవేక్షించేందుకు రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి కమిటీలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం మొత్తం 811 ఎల్‌పీజీ డిస్ట్రిబ్యూటర్లు ఉన్నారని మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.3 కోట్ల గ్యాస్ కనెక్షన్లు ఉండగా, అందులో 11 లక్షలు ఉజ్వల పథకం, 28 లక్షలు దీపం పథకం కింద ఉన్నాయని వెల్లడించారు. అదనంగా 7.5 లక్షల కమర్షియల్ కనెక్షన్లు కూడా ఉన్నాయని వెల్లడించారు. ప్రతి నెల రాష్ట్రంలో 58 లక్షల నుంచి 60 లక్షల వరకు గృహ వినియోగ గ్యాస్ సిలిండర్లు సరఫరా అవుతున్నాయని మంత్రి వివరించారు. ఇటీవల కొన్ని రోజులుగా ప్రజల్లో ఆందోళన కారణంగా బుకింగ్స్ రెట్టింపు అవుతున్నాయని తెలిపారు. అయినప్పటికీ గృహ వినియోగ సిలిండర్ల సరఫరాలో ఎలాంటి సమస్య లేదని స్పష్టం చేశారు. ప్రతిరోజూ సుమారు 2.5 లక్షల గ్యాస్ సిలిండర్లు సరఫరా జరుగుతున్నాయని తెలిపారు. గత రెండు రోజులుగా కూడా ఎక్కువగా గ్యాస్ సిలిండర్లు సరఫరా చేసినట్లు మంత్రి చెప్పారు. అయితే కమర్షియల్ సిలిండర్ల విషయంలో కొంత కొరత ఉన్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో రోజుకు సుమారు 23 వేల కమర్షియల్ సిలిండర్లు అవసరం ఉండగా ప్రస్తుతం 6,200 మాత్రమే సరఫరా చేయగలుగుతున్నామని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం కమర్షియల్ సిలిండర్ల సరఫరా 20 శాతం పరిమితిలోనే జరుగుతోందని చెప్పారు. గ్యాస్ సిలిండర్ల బ్లాక్ మార్కెటింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు సివిల్ సప్లయ్ భవన్‌లో ప్రత్యేక హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్యాస్ సరఫరా సంబంధిత ఫిర్యాదుల కోసం 18004250033 3 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు. కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల సరఫరా సమస్యను త్వరగా పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వానికి ఇప్పటికే లేఖ రాసినట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో గ్యాస్ సరఫరా వ్యవస్థను మరింత మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన చెప్పారు.

## టాంజానియాకు టెక్నాలజీ సహకారం..

# ముందుకొచ్చిన తెలంగాణ




**హైదరాబాద్, మార్చి 14:** టాంజానియాతో వ్యూహాత్మక భాగస్వామ్యానికి తెలంగాణ సర్కార్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. డిజిటల్ ఎకానమీగా మారాలన్న టాంజానియా లక్ష్యానికి సాంకేతిక సహకారం అందించడానికి తెలంగాణ ముందుకు వచ్చింది. టాంజానియా ఉన్నతస్థాయి ప్రతినిధి బృందంతో మంత్రి శ్రీధర్ బాబు భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ఐటీ, టూరిజం, హెల్త్ కేర్, లైఫ్ సైన్సెస్ రంగాల్లో కలిసి పనిచేయాలని నిర్ణయం తీసుకున్నారు. డిజిటల్ గవర్నెన్స్, స్టార్టప్ ఇన్నోవేషన్ ఎకోసిస్టం అభివృద్ధిపై సహకారం పెంచాలని ఇరు పక్షాలు అంగీకరించాయి. టాంజానియాలో ఫార్మా డిస్ట్రిబ్యూషన్ హబ్ ఏర్పాటు చేసే అవకాశాలపై అధ్యయనం చేయనున్నారు. తెలంగాణ 'మీ సేవ' మోడల్ ద్వారా పౌర సేవల డెలివరీ విధానంపై మార్గదర్శకత్వం అందించాలని సమావేశంలో నిర్ణయించారు. 'వీ హబ్' ద్వారా మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం కల్పించే అంశంపై చర్చించారు. స్కిల్లింగ్, రీ–స్కిల్లింగ్, అప్ – స్కిల్లింగ్ రంగాల్లో కూడా సహకారం అందించాలని సమావేశంలో నిర్ణయించారు. 'త్వరలో తెలంగాణతో ఎంవోయూ కుదుర్చుకుంటాం. ఈ భాగస్వామ్యం రెండు దేశాల మధ్య సాంకేతిక, ఆర్థిక సంబంధాలను మరింత బలోపేతం చేస్తుంది' అని టాంజానియా మంత్రి ప్రకటించారు.

## ద్రవిడ్, బిన్నీ, మిథాలీ రాజ్‌లకు...

# అరుదైన గౌరవం



**న్యూఢిల్లీ:** భారత క్రికెట్ నియంత్రణ మండలి నమన్ అవార్డుల జాబితాను ప్రకటించింది. 2024–25 సీజన్‌కు సంబంధించి క్రికెట్‌లో క్రీడాకారుల ప్రదర్శనలు, సేవలను గుర్తించేందుకు బిసిసిఐ ఈ అవార్డులను ఇస్తుంది. తన వార్షిక 'నమన్ అవార్డుల' ప్రదానోత్సవాన్ని ఆదివారం, మార్చి 15న న్యూఢిల్లీలో నిర్వహించనున్నట్లు తెలిపింది. ఈ వేడుకలో అత్యున్నత పురస్కారాలు ముగ్గురు దిగ్గజాలకు దక్కనున్నాయి. రాహుల్ ద్రవిడ్ , రోజర్ బిన్నీలకు కర్నల్ సి.కె. నాయుడు జీవితకాల సాఫల్య పురస్కారం.. మిథాలీ రాజ్‌కు 'మహిళల విభాగంలో దీజజ× జీవితకాల సాఫల్య పురస్కారం అందజేయనున్నారు. రాహుల్ ద్రవిడ్, ఆటగాడిగా తన సుదీర్ఘ కెరీర్‌లో 24,000కు పైగా అంతర్జాతీయ పరుగులు సాధించారు. అంతేకాదు, టీమిండియా ప్రధాన కోచ్‌గా వ్యవహరిస్తూ 2024లో ICC పురుషుల ౹20 ప్రపంచ కప్ టైటిల్‌ను గెలవడంలోనూ కీలక పాత్ర పోషించారు. ఒక ప్లేయర్ గా, కోచ్ గా రాణించిన ద్రవిడ్.. భారత క్రికెట్‌లో అత్యంత ప్రభావవంతమైన వ్యక్తులలో ఒకరిగా పేరు సంపాదించుకున్నారు.

అలాగే, 1983లో భారత్ ప్రపంచ కప్ గెలుచుకున్న జట్టులో కీలక సభ్యుడిగా ఉన్న బిన్నీ, ఆ టోర్నమెంట్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచారు. ఆ తర్వాత ఆయన కోచ్‌గా, సెలెక్టర్‌గా, నిర్వాహకుడిగా భారత క్రికెట్‌కు సేవలందించారు. ఇందులో 2022 నుండి 2025 వరకు BCCI అధ్యక్షుడిగా పనిచేశారు. ఇక, మహిళల వన్డే క్రికెట్‌లో అత్యధిక పరుగులు సాధించిన రికార్డు మిథాలీ తన పేరిట లిఖించుకున్నారు.

# తెలంగాణ షాన్

## సంపాదకీయం

### ట్రంప్..తిరోగమనం..

ఏది ఏమైనప్పటికీ తమ దేశం నుంచి అధిక సుంకాలను వసూలు చేస్తున్న ప్రపంచ దేశాల నుంచి అదే స్థాయిలో టారిఫ్‌లను వసూలు చేస్తామని ప్రగల్భాలు పలికిన అమెరికా అధ్యక్షుడు ఇప్పుడు మడమ తిప్పుతున్నారు. ట్రంప్ టారిఫ్‌లు కేవలం ఆర్థిక సమస్యలతోనే కాకుండా, అంతర్జాతీయ సంబంధాలపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. కెనడా, మెక్సికో, యూరోపియన్ యూనియన్ వంటి సన్నిహిత మిత్ర దేశాలు కూడా ఈ సుంకాల బారిన పడ్డాయి. ఈ దేశాలు ట్రంప్ చర్యలకు ప్రతీకార చర్యలుగా అమెరికన్ ఉత్పత్తులపై సుంకాలు విధించే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ పరిస్థితి వాణిజ్య యుద్ధాలకు దారితీసి, ప్రపంచ ఆర్థిక వ్యవస్థను మరింత బలహీనపరిచే ప్రమాదం ఉందని అంటున్నారుతొలుత ప్రపంచ వ్యాప్తంగా ఏప్రిల్ 10 నుంచి అమల్లోకి రావాల్సిన ప్రతీకార సుంకాల ఆదేశాలను 90 రోజులపాటు నిలిపివేశారు. ఆ వెంటనే టారిఫ్‌ల నుంచి 20 సెక్టార్ల ఉత్పత్తులకు మినహాయింపు కల్పించారు.

ట్రంప్ తీసుకున్న ఈ నిర్ణయాలను గమనిస్తే విషయం ఇట్టే అర్థమవుతున్నదివాస్తవానికి ఇతర దేశాల నుంచి అమెరికాకు దిగుమతి అవుతున్న వస్తువులపై భారీ టారిఫ్‌లను విధించడం వల్ల తమ దేశంలో స్వదేశీ వస్తువుల కొనుగోళ్లు పుంజుకుంటాయని ట్రంప్ భావించారు. అలాగే, అమెరికాలో ఇబ్బడిముబ్బడిగా పరిశ్రమలు పుట్టుకొచ్చి, తమ పౌరులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయనేది ట్రంప్ ఆలోచన. అందుకే ముందూవెనకా ఆలోచించకుండా ప్రపంచ దేశాలపై ప్రతీకార సుంకాలను ప్రకటించేశారు. ఈ క్రమంలోనే చైనాపైనా టారిఫ్‌లు వేశారు.ట్రంప్ దెబ్బకు ఇతర దేశాలన్నీ కాళ్లబేరానికి వస్తే, చైనా మాత్రం అమెరికా అధ్యక్షుడికి దీటుగా బదులిస్తూ రావడం, దీంతో ఆ దేశంపై అమెరికా మరింత పెద్ద మొత్తంలో సుంకాలు ప్రకటిస్తూ రావడం చకచకా జరిగిపోయాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన 'అమెరికా ఫస్ట్ విధానంతో అనేక దేశాల నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై భారీ సుంకాలు (టారిఫ్‌లు) విధిస్తూ ప్రపంచ ఆర్థిక వ్యవస్థను కలవరపెడుతున్నారు. ఈ చర్యలు అమెరికన్ ఉద్యోగాలను, స్థానిక పరిశ్రమలను కాపాడతాయని ట్రంప్ వాదిస్తున్నప్పటికీ, ఇవి గ్లోబలైజేషన్ యుగానికి ముగింపు పలుకుతున్నాయని పలు దేశాల నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ టారిఫ్‌లు అంతర్జాతీయ వాణిజ్యంపై తీవ్ర ప్రభావం చూపుతూ, దేశాలను స్థానిక ఉత్పత్తులపై ఆధారపడేలా మార్చుతున్నాయి. 1991లో సోవియట్ యూనియన్ పతనం తర్వాత ప్రారంభమైన గ్లోబలైజేషన్ యుగం ఇప్పుడు ముగిసినట్లేనని బ్రిటన్ ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ అభిప్రాయపడ్డారు. ట్రంప్ విధించిన టారిఫ్‌లు అనేక దేశాలను తమ దేశీయ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకోవడానికి దారితీస్తున్నాయని ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో, అమెరికా కూడా తన స్థానిక వనరులపై ఆధారపడే అవసరం ఏర్పడుతుందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. చైనా, భారత్, యూరోపియన్ యూనియన్ వంటి దేశాలు ఈ టారిఫ్‌లను ఎదుర్కొనేందుకు తమ ఆర్థిక విధానాలను సవరించుకుంటున్నాయి.ట్రంప్ తన టారిఫ్ విధానాన్ని సమర్థిస్తూ, అమెరికన్ పౌరులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలను కాపాడటమే తన లక్ష్యమని పేర్కొన్నారు. విదేశీ దిగుమతులపై అధిక సుంకాలు విధించడం ద్వారా స్థానిక తయారీ రంగాన్ని ప్రోత్సహించాలని, విదేశీ ఉత్పత్తుల ఆధిపత్యాన్ని తగ్గించాలని ఆయన భావిస్తున్నారు. అయితే, ఈ చర్యలు అమెరికన్ వినియోగదారులకు వస్తువుల ధరల పెరుగుదలకు దారితీస్తాయని, అంతర్జాతీయ వాణిజ్య సంబంధాలను దెబ్బతీస్తాయని విమర్శకులు హెచ్చరిస్తున్నారు. ఉదాహరణకు, చైనా నుంచి దిగుమతి అయ్యే ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్ విడిభాగాలపై విధించిన సుంకాలు అమెరికన్ కంపెనీల ఉత్పత్తి ఖర్చులను పెంచుతున్నాయి.రెండు దేశాల మధ్య జరిగిన సుంకాల యుద్ధం పర్యవసానంగా ప్రపంచ వ్యాప్తంగా స్టాక్ మార్కెట్లు కుప్పకూలాయి. అమెరికా మార్కెట్లపైనా ఈ ప్రభావం కనిపించింది.అంతర్జాతీయంగా నెలకొన్న ఈ గందరగోళ పరిస్థితుల వల్ల మదుపరుల కోట్లాది సంపద ఆవిరైపోయింది. అమెరికాలో ద్రవ్యోల్బణం పెరగడంతోపాటు ఆర్థికమాంద్యం ఛాయలు కనిపించాయి. ట్రంప్ వైఖరిపై ఆయన మద్దతుదారులే బహిరంగంగా పెదవి విరిచారు. దీనికి యావత్ ప్రపంచం సాక్ష్యంగా నిలిచింది. ఇంతా జరిగిన తర్వాత ట్రంప్‌కు తత్వం బోధపడినట్టు అర్థమవుతున్నది.ప్రపంచ దేశాలు ముఖ్యంగా చైనాతో పంతానికిపోతే అమెరికాకే నష్టమన్న విషయాన్ని ట్రంప్ గ్రహించినట్టు తెలుస్తున్నది. స్మార్ట్‌ఫోన్లు, కంప్యూటర్ల విషయంలో అమెరికాకు చైనా అతిపెద్ద సరఫరదారుగా ఉంది. గత ఏడాది లెక్కల ప్రకారం చైనా 88 బిలియన్ డాలర్ల విలువైన స్మార్ట్‌ఫోన్లను, కంప్యూటర్లను అమెరికాకు ఎగుమతి చేసింది. అమెరికన్లు ఉపయోగించే ప్రతి 10 స్మార్ట్‌ఫోన్లలో నాలుగు, అలాగే ప్రతి మూడు కంప్యూటర్లలో ఒకటి చైనాలో ఉత్పత్తి అయిందే.చైనాలోనే సుమారు 80 శాతం ఐఫోన్లు ఉత్పత్తవుతున్నాయి. వీటిలో 58 శాతం అమెరికాకే ఎగుమతవుతున్నాయి. దాదాపు 8 బిలియన్ డాలర్ల విలువైన ప్లాస్టిక్ కుర్చీలను చైనా నుంచే అమెరికా దిగుమతి చేసుకుంది. అలాగే, పిల్లల ఆటవస్తువులను కూడా అగ్రరాజ్యానికి పెద్దమొత్తంలో చైనా ఎగుమతి చేస్తున్నది. ఇటువంటి తరుణంలో ఆ దేశంపై పెద్ద మొత్తంలో టారిఫ్‌లు అమలు చేస్తే అంతిమంగా అమెరికన్ల జేబులకే చిల్లు పడుతుంది.ఇప్పటికిప్పుడు అమెరికాలో ఈ వస్తువుల ఉత్పత్తి సాధ్యపడదు. అందుకే ట్రంప్ టారిఫ్‌ల విషయంలో వెనక్కి తగ్గినట్టు అర్థమవుతున్నది. స్మార్ట్‌ఫోన్లు, కంప్యూటర్లు, చిప్‌లు, సోలార్‌సెల్, మెమోరీకార్డులు వంటి ఉత్పత్తులను టారిఫ్‌ల నుంచి అమెరికా మినహాయించింది. ఈ నిర్ణయంతో ఫెంటానిల్‌పై 20 శాతం సుంకం మినహా వేరే ఏ ఇతర సుంకాలు చైనాపై భారం మోపలేకపోయాయి.

## ఉపాధి హామీ పథకాన్ని దెబ్బతీసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు

-ఉపాధి హామీ పథకాన్ని పోరాటాలతో కాపాడుకుందాం

-ఉపాధి హామీ కూలీల ఫోటో క్యాప్చర్ విధానం రద్దు చేయాలి

-ఉపాధి హామీ కూలీలకు బకాయి బిల్లులు వెంటనే చెల్లించాలి

-సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అతిమేల మానిక్





(తెలంగాణ షాన్ న్యూస్)

గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని దెబ్బతీసేందుకు కేంద్ర బిజెపి ప్రభుత్వం కుట్ర చేస్తుందని, ఈ పథకాన్ని పోరాటాలతో కాపాడుకోవాలని, కూలీలకు నష్టం చేసే ఫోటో క్యాప్చర్ వెంటనే రద్దు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అతిమేల మానిక్ అన్నారు.ఈరోజు కొండాపూర్ మండలం శివన్న గూడెం గ్రామంలో ఉపాధి హామీ కూలీలతో సిపిఎం పార్టీ బృందం పర్యటించింది. ఈ సందర్భంగా అతిమేల మాణిక్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసి కుట్రలు పెద్ద ఎత్తున చేస్తుందని అన్నారు ఉపాధి కూలీలకు ఫోటో క్యాప్చర్ తో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వార వారం చెల్లించవలసిన కూలీ డబ్బులు ఆరువారాలైన డబ్బులు చెల్లించలేదని అన్నారు కేంద్ర ప్రభుత్వం 120 రోజులకు పని దినాలు పెంచుతున్నమని ప్రగల్బల్ పలుకుతుందని అన్నారు. బడ్జెట్లో నిధులు తగ్గించి ఏరకంగా పని దినాలు పెంచుతారని అన్నారు. ఇప్పటివరకు ఈ పథకానికి కేంద్రం 90 శాతం రాష్ట్రం 10 శాతం నిధులు కేటాయింపు ఉండేదని. విబి జి రామ్ జి చట్టం తేవడంతో కేంద్రం 60 శాతం రాష్ట్రం 40 శాతం నిధుల కేటాయింపు ఉండాలని రాష్ట్రాల మీద పెద్ద ఎత్తున భారం వేస్తుందని అన్నారు. ఉపాధి హామీ పథకాన్ని దెబ్బతీసే కుట్రలోనే కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుందని అన్నారు. పేద ప్రజలకు ఉపయోగపడే ఉపాధి హామీ పథకాన్ని కాపాడుకునేందుకు పోరాటాలకు సిద్ధం కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కొండాపూర్ మండల కార్యదర్శి రాజయ్య పార్టీ మండల కమిటీ సభ్యులు బాబురావు నాయకులు అర్జున్ ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.

## కుషాయిగూడ నుంచి కాశీకి యాత్ర ప్రత్యేక బస్సు

కాప్రా మార్చి 14



తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో కుషాయిగూడ డిపో నుండి కాశీకి ప్రత్యేక బస్సును ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ వేణుగోపాల్ ఓప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ నుండిఉజ్జయినిమహంకాళి,ఓంకారశ్వర్,శారద శక్తిపీఠం,అయోధ్య, ప్రయాగ్రాజ్,కాశీ యాత్ర బస్టాండ్ ఏర్పాటు చేస్తున్నారు మార్చి 28 సాయంత్రం 6:00 గంటలకు ఈసీఐఎల్ బస్టాండ్ నుండి బయలుదేరుతుంది. టికెట్ ధర ?8,000 ఈ యాత్రకు వెళ్లాలనుకునే వారు ముందుగా బుకింగ్ చేసుకోవాలి సంప్రదించాల్సిన నంబర్లు 9959226145,9603549388

## వైభవంగా నల్ల పోచమ్మ తల్లి కళ్యాణోత్సవం



(తెలంగాణ షాన్ న్యూస్ )

గుమ్మడిదల మున్సిపాలిటీ 01వ వార్డులో శ్రీ నల్ల పోచమ్మ తల్లి కళ్యాణోత్సవాన్ని భక్తి శ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయంత్రం గ్రామస్తులు బోనాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకొని ఆశీర్వాదాలు పొందారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ నిర్మాణదాత, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్, వైస్ చైర్మన్ సంధ్య, మున్సిపల్ కమిషనర్ దశరథ, మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రంజాన్ తోఫాలను పంపిణీ చేసిన రజితపరమేశ్వర్ రెడ్డి




కాప్రా మార్చి 14

ఉప్పల్ కుతుబ్షాహీ పెద్ద మసీదులో ఉప్పల్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మందముల రజిత పరమేశ్వర్ రెడ్డి రంజాన్ తోఫాలను పంపిణీ చేశారు శుక్రవారం ఏర్పాటు చేసిన రంజాన్ తోఫాల పంపిణీకి మరియు సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఖాజా మౌలానా ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో రజితపరమేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు బాకారం లక్ష్మణ్, ఈగ అంజయ్య ముదిరాజ్,బజార్ జగన్నాథ్ గౌడ్, తెల్కల మోహన్ రెడ్డి, లింగంపల్లి రామకృష్ణ , తుమ్మల దేవి రెడ్డి,బూసం రఘునాథ్ రెడ్డి,అస్లాం,అజ్జు,అల్లా భాషా,జలీల,కాసిం, ఆసిఫ్,,అన్వర్ పాషా,అఫ్జల్, ఇషాద్,ఆసిఫ్, సలీం,మినాజ్,నాగూర్ భాషా,ఖాజా,రసూల్ మొహ్మద్,అష్రఫ్,మౌలాలి,జంగీర్ జబ్బార్,బజారు నవీన్ గౌడ్,రంగుల శేఖర్ ముదిరాజ్,జుబేద్, మోసిన్, వాయద్,కుతుబ్షాహి ఉప్పల్ పెద్ద మజీద్ కమిటీ సభ్యులు, ముస్లిం సోదరులు మరియు పట్టణ ప్రజలు తదితరులు ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు.

## పటాన్చెరు నియోజకవర్గంలో చిన్నారుల మధ్య మాద్రి పృథ్వీరాజ్ జన్మదిన వేడుకలు



పటాన్‌చెరు నియోజకవర్గానికి చెందిన యువ నాయకుడు, సామాజిక సేవా కార్యక్రమాలలో ముందుండే మాద్రి పృథ్వీరాజ్ గారి జన్మదినాన్ని పురస్కరించుకుని అమీన్‌పూర్‌లోని మహిమా మినిస్ట్రీస్ లో MPR యువసేన సభ్యులు నిర్వహించిన జన్మదిన వేడుకలకు MDR ఫౌండేషన్ అధ్యక్షుడు మధు హాజరయ్యారు.ఈ సందర్భంగా చిన్నారులతో కలిసి కేక్ కట్ చేసి వారికి ప్రత్యేకంగా భోజనాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం చిన్నారులు మాద్రి పృథ్వీరాజ్ గారికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.సమాజ సేవలో ముందుండే నాయకుడిగా పృథ్వీరాజ్ గారు మరింత ఉన్నత స్థానాలకు చేరుకోవాలని చిన్నారులు మరియు కార్యక్రమంలో పాల్గొన్న వారు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో వీూ= యువసేన సభ్యులు, స్థానిక నాయకులు, అభిమానులు మరియు చిన్నారులు పాల్గొన్నారు.

## ఖమేనీ కోసం సీఐఏ పక్కాప్లాన్

**బాగ్దాద్, మార్చి 14 :** హ్రాన్ నగరం ఉదయం 8గంటలకు ఆ రోజు కూడా రోజూ లాగానే నడుస్తోంది. కానీ ఓ గంటసేపట్లోనే ఊహకందని విధ్వంసం వాళ్ల కళ్లకు కనిపించింది. ఇజ్రాయెల్‌లోని 1200 మైళ్ల దూరం నుంచి వచ్చిన సూపర్ జెట్లు.. ఆ దేశ సుప్రీం లీడర్ ఖమైనీ భూగర్భ గృహాన్ని కూలచేశాయి. ఆయన్ను ఖతం చేశాయి. మిలటరీ దాడుల చరిత్రలోనే అత్యంత పకడ్బందీగా.. సంక్లిష్టంగా జరిగిన ఈ ఆపరేషన్ డికాపిటేషన్ చేశారు.. డికాపిటేషన్ అంటే శిరచ్ఛేధం. ఇక్కడ చెప్పుకోవాలంటే ఇరాన్‌ను తల లేని మొండెం చేయడమే. ఇరాన్ ఐడెంటిటీ ఆ దేశ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమైనీ.. ఆయన్ను పడగొడితే ఇరాన్‌ను పడగొట్టినట్లే. యుద్ధమంటే వారాలు, నెలల తరబడీ సాగనవసరం లేదని నిరూపించిన ఆపరేషన్ ఇది. ఇరానీయన్ సుప్రీం లీడర్ ఖమైనీ బంకర్‌ను బద్ధలకొట్టం వెనుక.. సీఐఏ , మోసాద్ ఏళ్ల తరబడీ సాగించిన ఇంటెలెజెన్స్ ఆపరేషన్ ఉంది. ఇరాన్‌లో కమ్యునికేషన్ వ్యవస్థలను బద్ధలు కొట్టి.. అక్కడి సీసీ కేమెరాలను హ్యాక్ చేసి, తమ మనుషులను ఖమేనీ కోర్ టీమ్‌లోకి పంపించి.. శాటిలైట్ చానళ్లతో ఆనవాళ్లు రాబట్టి.. ఎయిర్ డిఫెన్స్‌ను ఏమార్చి.. 200 ఫైటర్‌జెట్లను పంపించి.. ఇలా చాలా చాలా చేసి.. ఏక్‌దమ్ ఓకేసారి నేలమట్టం చేశారు.అయతుల్లా అలీ ఖమేనీని కొన్నేళ్లుగా వెంటాడుతున్నాయి ఇజ్రాయెల్ గూఢచారులు ఇరాన్ రాజధాని టెహ్రాన్‌ను తమ అరచేతిలోకి తెచ్చుకున్నారు. "మాకు టెహ్రాన్ నగరం మా జెరూసలేం అంత బాగా తెలుసు" అని ఒక ఇజ్రాయెల్ గూఢచారి అధికారి వ్యాఖ్యానించడం వెనుక ఉన్న అసలు రహస్యం.. టెహ్రాన్ వీధుల్లోని ట్రాఫిక్ కెమెరాలు . అవును, టెహ్రాన్ నగరంలోని దాదాపు ప్రతి ట్రాఫిక్ కెమెరాను ఇజ్రాయెల్ ఏళ్ల క్రితమే హ్యాక్ చేసింది. ఆ కెమెరాల ద్వారా వచ్చే ప్రతి దృశ్యం ఎన్‌క్రిప్ట్ చేసి మరీ నేరుగా టెల్ అవీవ్‌లోని సర్వర్లకు చేరేది. ఖమేనీ కార్యాలయం ఉన్న పాశ్చర్ స్ట్రీట్ కెమెరాను కూడా ఇజ్రాయెల్ తన ఆధీనంలోకి తీసుకోగలిగిందంటే వాళ్లు ఏ రేంజ్ లో టెహ్రాన్‌లోకి చొచ్చుకుపోయారో అర్థం చేసుకోవచ్చు. ఆ ఒక్క కెమెరా ద్వారా ఖమేనీ కదలికలను పసిగట్టేవారు. బాడీగార్డులు తమ వ్యక్తిగత కార్లను ఎక్కడ పార్క్ చేస్తారు, వారు ఏ సమయంలో విధులకు వస్తారు, వారి దినచర్య ఏమిటి అనేవన్నీ ఇజ్రాయెల్ విశ్లేషకులు కూర్చొని గమనించేవారు. ఇజ్రాయెల్ ఇంటిలెజెన్స్ ఓ సీక్రెట్ అల్గారిథమ్ ను కూడా రూపొందించింది. దీని ఆధారంగా ఖమేనీ భద్రతా సిబ్బంది అడ్రెస్‌లు వారి ఫోన్ నెంబర్లు, ప్రయాణించే మార్గాలతో డేటాబేస్ సిద్ధం అయింది. కొన్ని కోట్ల డేటా పాయింట్లు విశ్లేషించి ఖమేనీ ఎప్పుడు, ఎక్కడ, ఎవరితో సమావేశం కాబోతున్నారో గంటల ముందే పసిగట్టే స్థాయికి మొసాద్ చేరుకుంది. ఇంకోవైపు సీఐఏ తన మనుషులను ఖమేనీ కోర్ గ్రూపులో చేర్చింది. ఆ రోజు.. ఉదయం ఖమేనీ తన మిలటరీ వ్యూహకర్తలు, నేషనల్ సెక్యూరిటీ అడ్వైజర్, రాజకీయ ప్రముఖులతో పాశ్చర్ స్ట్రీట్‌లోని తన నివాసంలో సమావేశం అవుతున్నట్లు ఆ లీడ్ కూడా కన్ఫామ్ చేశారు. మోసాద్ వెంటనే ఖమేనీ ఉన్న పాశ్చర్ స్ట్రీట్ సమీపంలోని 12 మొబైల్ టవర్లనుహ్యాక్ చేసి జామ్ చేసింది. ఎవరైనా ఖమేనీ భద్రతా సిబ్బందికి ఫోన్ చేస్తే అది నిరంతరం బిజీ అని వచ్చేలా చేశారు. దీనివల్ల దాడి జరగబోతోందని ఎవరైనా హెచ్చరించాలనుకున్నా ఆసమాచారం లోపలికి వెళ్లకుండా కట్టడి చేశారు. శనివారం ఉదయం ఖమేనీ తన కార్యాలయంలో సమావేశానికి వస్తున్నట్లు ట్రాఫిక్ కెమెరాలు, సిగ్నల్ ఇంటెలిజెన్స్ ద్వారా నిర్ధారించుకున్న ఇజ్రాయెల్.. ఆపరేషన్ మొదలు పెట్టింది. దీనికి ముడంచెల వ్యూహాన్ని చేపట్టారు. ముందుగా వాళ్ల రాడార్‌లోకి డికాయ్ ఆపరేషన్ చేసి.. వాటిని కన్ఫ్యూజ్ చేశారు. పక్కనే ఉన్న సముద్రంలో నుంచి టామ్‌హాక్ క్షిపణులు వెళ్లి.. ఎయిర్‌డిఫెన్స్ ను నాశనం చేశాయి. అంతే కాదు. రాబోయే ఎయిర్ క్రాఫ్ట్‌లకు ఎయిర్ ఫీల్డ్‌ను క్లియర్ చేసి పెట్టాయి. ఆ తర్వాత ఈ-35, ఈ-22లు , ః2 స్పిరిట్ బాంబర్లు విధ్వంసం చేశాయి. దీనిపై డీటెయిల్డ్ గా ఈ కథనంలో చూడండి. ఇక ఆరోజన టామ్ హాక్‌లు ఎయిర్‌ఫీల్డ్‌ను క్లియర్ చేశాక.. 200 సూపర్‌జెట్లు టెహ్రాన్ మీదకు దూసుకెళ్లాయి. టామ్‌హాక్‌లు మిగిల్చిన పని పూర్తి చేయడం తో పాటు.. మిగిలిన లక్ష్యాలను కూల్చేశాయి. ఈ 200 సూపర్‌జెట్లు మధ్యలో ఓ స్పెషన్ స్క్వాడ్రన్ ఉంది. దాని లక్ష్యం మాత్రం అలీ ఖమైనీ అధికారిక నివాసం బైత్ రెహ్బరీ సముదాయం. ఇది బంకర్ బస్టర్ మ్యూనిషన్లతో రెడీ గా ఉంది.

## ఈరోజు పుట్టినరోజు జరుపుకుంటున్న యువ నాయకుడు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, MDR ఫౌండేషన్ కో-ఫౌండర్ శ్రీ మాద్రి పృథ్వీరాజ్ గారికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు




(తెలంగాణ షాన్ న్యూస్ )

సేవా కార్యక్రమాలతో యువతకు ఆదర్శంగా నిలుస్తూ, సామాజిక సేవలో తనదైన ముద్ర వేస్తున్న మీలాంటి నాయకులు సమాజానికి ఎంతో అవసరం. మీరు చేపట్టే ప్రతి కార్యక్రమం విజయవంతం కావాలని, మరింత ఉన్నత స్థాయికి చేరుకుని ప్రజలకు మరింత సేవ చేయాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాము.మీకు ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, విజయాలు చేకూరాలని కోరుకుంటూ...జన్మదిన శుభాకాంక్షలు పృథ్వీరాజ్ గారికి!

## ఐలాపూర్ తండాకు చెందిన కిషన్ నాయక్ గారి మృతి పట్ల సంతాపం వ్యక్తం చేసిన BRS నాయకులు ఐలాపూర్ మాణిక్ యాదవ్




(తెలంగాణ షాన్ న్యూస్ )

అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఐలాపూర్ తండాకు చెందిన కిషన్ నాయక్ అనారోగ్యంతో మృతి చెందారని తెలుసుకున్న వెంటనే దీ=ూ నాయకులు ఐలాపూర్ మాణిక్ యాదవ్ వారి నివాసానికి వెళ్లి భౌతికకాయానికి నివాళులు అర్పించారు.అనంతరం కిషన్ గారి కుటుంబ సభ్యులను పరామర్శిస్తూ వారి దుఃఖంలో భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, ఈ క్లిష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని సూచించారు.కిషన్ నాయక్ గారి మరణం ఐలాపూర్ తండాకు తీరని లోటని పేర్కొంటూ, వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# ఏ పార్టీ చూసిన అంతేగా... అంతేగా

**హైదరాబాద్, మార్చి 14 :** అనగనగా ఒక రాజు. ఓరోజు దర్బారులో పంచాయితీ నిర్వహిస్తున్నారు. ఓ దొంగతనం కేసులో అందరినీ విచారిస్తున్నారు. ఇంతకీ జరిగిన దొంగతనం ఏంటంటే.. ఓ రైతు మామిడి తోటలో కొందరు అక్రమంగా ప్రవేశించి మామిడి కాయలను దొంగిలించారు. ఆ తర్వాత వాటిని విక్రయించి, సొమ్ము చేసుకున్నారు. ఈ విషయాన్ని ఆ రైతు రాజుకు విన్నవించాడు. దీంతో పుర్వాపరాలు కనుకున్న రాజు దొంగతనం పంచాయతీని విచారించడం మొదలు పెట్టారు. అనుమానితులను పంచాయతీలో ప్రవేశపెట్టారు. ఒక్కొక్కరిని విచారించారు. అందరూ పొంతనలేని వివరాలు చెప్పారు. అయితే మామిడి కాయలను దొంగిలించామనే విషయాన్ని చెప్పకుండా విక్రయించిన విషయాన్నిఒప్పుకున్నారు. ఇదే విషయాన్ని పట్టుకున్న రాజు.. పదే పదే వారిని అడగడంతో మామిడికాయలను దొంగిలించామని ఒప్పుకున్నారు. రాజు విచారిస్తున్న సమయంలో ఒకరి మీద ఒకరు ఆరోపణలు చేసుకున్నారు. ఎవరూ తాము దొంగతనానికి పాల్పడలేదని చెప్పారు. ఈ ఉపోద్ఘాతం ఎందుకంటే.. తెలంగాణ రాష్ట్రంలో పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన పార్టీ, బాధిత పార్టీ చెబుతున్న మాటలు, వల్లె వేస్తున్న సుభాషితాలు అలాగే ఉన్నాయి మరి. వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో ఆపరేషన్ ఆకర్ష్ కు తెరదీశారు. దుగ్యాల శ్రీనివాసరావు నుంచి మొదలు పెడితే సంతోష్ వరకు అందరూ కాంగ్రెస్ లో చేరారు. నాడు కేసీఆర్ ఆ పరిణామం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక పార్టీ నుంచి ఇంకో పార్టీలోకి ఎలా తీసుకుంటారు? పార్టీ ఫిరాయింపులకు ఎలా పాల్పడతారు అని ప్రశ్నించారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత కేసీఆర్ తొలి ముఖ్యమంత్రి అయిన తర్వాత ఫిరాయింపులకు గేట్లు తెరిచారు కేసీఆర్. టీడీపీ నుంచి మొదలు పెడితే వైసీపీ వరకు ఏ పార్టీని వదలకుండా అందరినీ వదలకుండా కొనేశారు. శాసనసభలో, శాసనమండలిలో ప్రతిపక్షం అనేది లేకుండా చూసుకున్నారు. తెలంగాణలో 2023లో జరిగిన ఎన్నికల్లో కేసీఆర్ పార్టీకి ఊహించని ఎదురు దెబ్బ తగిలింది. అంతే కాదు, కాంగ్రెస్ పార్టీ ఫిరాయింపులకు పచ్చజెండా ఊపింది. దీంతో గులాబీ పార్టీ నుంచి ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పల్లవి పాడారు. దీనిని ప్రశ్నిస్తూ గులాబీ పార్టీ సుప్రీం కోర్టు దాకా వెళ్లింది. అనేక దఫాలుగా కేసును విచారించిన సుప్రీం కోర్టు నిర్ణయాధికారాన్ని స్పీకర్ కు వదిలేసింది. స్పీకర్ అనేక రకాలుగా విచారించి.. గులాబీ పార్టీ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ లో చేరారు అని చెప్పడానికి రుజువులు లేవని తేల్చి పడేశారు. ఈ పరిణామాన్ని గులాబీ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ప్రజాస్వామ్యం సర్వనాశనమైందని విలపిస్తోంది. కానీ, అధికారంలో ఉన్నప్పుడు గులాబీ పార్టీ ఏ చేసింది? గులాబీ దళపతి ఎలాంటి వ్యాఖ్యలు చేశారు? అనే విషయాలను మర్చిపోతే ఎలా? ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో మాట్లాడే నైతికత గులాబీ పార్టీకి లేదు. సమర్థించుకునే స్థాయి కాంగ్రెస్ పార్టీకి ఏమాత్రంలేదు. ఎందుకంటే అందరూ గురవింద గింజలే.

# అల్లు సినిమాస్ స్పెషలేంటంటే...



**హైదరాబాద్, మార్చి 14 :** భాగ్య నగరం లో సినిమా ప్రేమికులు ఎక్కువ. ఫలానా థియేటర్‌లో మంచి విజువల్ ఎక్స్‌పీరియన్స్ ఉంటుందంటే... ఎంత దూరమైనా ట్రావెల్ చేస్తారు. ఫర్ ఎగ్జాంపుల్... ప్రసాద్స్ మల్టీప్లెక్స్‌లోని పీసీఎక్స్ (లార్జ్) స్క్రీన్‌లో సినిమా చూడటం కొందరికి ఓ అలవాటు! టెక్నికల్‌గా హై స్టాండర్డ్స్ ఉన్న మన సినిమాలను, హాలీవుడ్ మూవీస్‌ను మంచి వ్యూయింగ్ ఎక్స్‌పీరియన్స్ కోసం పీసీఎక్స్ (లార్జ్) స్క్రీన్‌లో ఫస్ట్ డే ఫస్ట్ షో చూసే ప్రేక్షకులు కొందరు అయితే... వీకెండ్ ఫ్యామిలీతో కలిసి సినిమా చూడాలని ప్లాన్ చేసుకునే వాళ్ళు ఇంకొందరు. ఆ సినీ ప్రేమికుల కోసం హైదరాబాద్ సిటీలో మరొక స్క్రీన్ వచ్చింది. 'అల్లు సినిమాస్'లోని డాల్బీ సినిమా స్క్రీన్. దాని స్పెషాలిటీ ఏమిటి? అందులో సినిమా ఎందుకు చూడాలి? అంటే... ఇప్పటి వరకు హైదరాబాద్ సిటీలోని పలు థియేటర్లలో మీరు త్రీడీ సినిమా చూసి ఉండొచ్చు. అయితే... ఒక్కసారి 'అల్లు సినిమాస్'లోని స్క్రీన్ 1 (డాల్బీ సినిమా)లో త్రీడీ ఫిల్మ్ చూడండి. 'ది బెస్ట్ సినిమాటిక్' ఎక్స్‌పీరియన్స్ ఇస్తుందని చెప్పడంలో అసలు సందేహం అవసరం లేదు. టాలీవుడ్ జర్నలిస్టులను అల్లు సినిమాస్ (థియేటర్ విజిట్)కు తీసుకు వెళ్ళారు. సీతా రాములుగా సాయి పల్లవి, రణబీర్ కపూర్... రావణుడిగా యశ్ నటిస్తున్న 'రామాయణ' గ్లింప్స్ ప్రదర్శించారు. త్రీడీ వ్యూయింగ్ ఎక్స్‌పీరియన్స్ సూపర్బ్ అని చెప్పాలి. 'అల్లు సినిమాస్'లోని 'డాల్బీ సినిమా' స్క్రీన్‌లో మెయిన్ ఎట్రాక్షన్ & స్పెషాలిటీ... సౌండ్ క్వాలిటీ. థియేటర్ టోటల్ సీటింగ్ కెపాసిటీ 634. ఇందులో టోటల్ 78 స్పీకర్స్, 165 సౌండ్ ఔట్ లెట్స్ ఉన్నాయి. ప్రస్తుతానికి (మార్చి 12, 2026)కు ఇండియాలోని అతిపెద్ద డాల్బీ సినిమా స్క్రీన్ ఇదే. హైదరాబాద్ సిటీలో మొట్టమొదటి స్క్రీన్ కూడా! ఇది ఫ్లాగ్ షిప్ డాల్బీ సినిమా ఆడిటోరియం కూడా!'అల్లు సినిమాస్' డాల్బీ సినిమా స్క్రీన్‌లో సౌండ్ క్వాలిటీ సూపర్బ్ అని చెప్పవచ్చు. వరల్డ్ క్లాస్ లెవల్ హియరింగ్ ఎక్స్‌పీరియన్స్ ఇస్తుంది. ప్రతి చిన్న సౌండ్, బీట్ చాలా స్పష్టంగా వినబడుతుంది. అందువల్ల ఆర్ఆర్ (నేపథ్య సంగీతం) పరంగా ఈ స్క్రీన్ నెక్స్ట్ లెవల్ సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ ఇస్తుంది. విజువల్ ఎక్స్‌పీరియన్స్ కూడా సూపర్బ్. ప్రపంచంలోని అతి పెద్ద స్క్రీన్‌లలో అల్లు సినిమా డాల్బీ సినిమా స్క్రీన్ ఒకటి. ఈ స్క్రీన్ సైజ్ 75 అడుగుల వెడల్పుతో ఉంది. ఫ్లాట్ యాస్పెక్ట్ రేషియోలో ఇందులో సినిమాలను ప్రదర్శించనున్నారు. ఇండియాలో ఇంత పెద్ద డాల్బీ సినిమా స్క్రీన్, హైదరాబాద్‌లోనూ ఇంతకు ముందు లేదు. డాల్బీ సినిమా డిజైన్ ప్రమాణాల ప్రకారం... డ్యూయల్ డాల్బీ విజన్, 6ఖ లేజర్ ప్రొజెక్షన్ సిస్టమ్ కలిగి ఉంది. ఎక్స్‌ట్రీమ్ బ్రైట్ నెస్, డీపర్ బ్లాక్స్, రిచ్‌లీ వైబ్రెంట్ కలర్స్‌తో ఈ సినిమా హాలులో విజువల్ క్వాలిటీ కూడా ది బెస్ట్ సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ ఇస్తుందని చెప్పడంలో సందేహం అవసరం లేదు. ఫ్లాగ్ షిప్ డాల్బీ సినిమా స్క్రీన్ కాకుండా 'అల్లు సినిమాస్'లో మరో మూడు స్క్రీన్‌లు ఉన్నాయి. వాటిలో బార్కో 4ఐ లేజర్ ప్రొజెక్షన్, డాల్బీ అట్మోస్ సరౌండ్ సౌండ్ సిస్టమ్ ఉన్నాయి. ఆ మూడింటి సీటింగ్ కెపాసిటీ 717 సీట్లు.

# 3 కార్పొరేషన్లకు విడివిడిగా ఎన్నికలు

**హైదరాబాద్, మార్చి 14 :** హైదరాబాద్ మహానగర పాలనలో కొత్త అధ్యాయం మొదలైంది. జీహెచ్ఎంసీని మూడు కార్పొరేషన్లుగా విభజిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఇప్పటికే అమలులోకి వచ్చింది. ముగ్గురు కమిషనర్ల నియామకం కూడా పూర్తి కావడంతో, ఇప్పుడు అందరి దృష్టి ఎన్నికల నిర్వహణపై పడింది. అయితే, మూడు కార్పొరేషన్లకు ఒకేసారి కాకుండా, ఒక్కో కార్పొరేషన్‌కు విడివిడిగా ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇలా చేయడానికి లోతైన రాజకీయ వ్యూహం ఉన్నట్లుగా చెబుతున్నారు. ప్రస్తుతం ఒక్కో మున్సిపల్ కార్పొరేషన్ లో వంద వార్డులు ఉన్నాయి. అయితే వాటిని మార్చాలనుకుంటున్నారు. వార్డుల సంఖ్యను పెంచడం ద్వారా ఏ ఒక్క రాజకీయ పార్టీకి ఏకపక్షంగా పట్టు చిక్కకుండా చేయాలన్నది సర్కార్ ఆలోచనగా చెబుతున్నారు. గ్రేటర్ పరిధిలోని బలమైన ఓటు బ్యాంకులను ముక్కలు చేయడం ద్వారా రాజకీయ శక్తిని వికేంద్రీకరించాలని చూస్తోంది. ఈ వార్డుల పునర్విభజన ఫలితాలే రాబోయే రోజుల్లో కొత్తగా ఏర్పడిన మూడు కార్పొరేషన్ల మేయర్ పీఠాలను ఎవరు అధిరోహించాలనేది నిర్ణయించేలా చేయాలనుకుంటున్నారు. మల్కాజ్‌గిరి వంటి కీలక ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీకి క్షేత్రస్థాయిలో ఇంకా పటిష్టమైన యంత్రాంగం సిద్ధం కాలేదు. అక్కడ బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఇప్పటికీ బలంగా ఉండటం అధికార పార్టీకి కొంత ఆందోళన కలిగిస్తోంది. ఒకేసారి ఎన్నికలకు వెళ్తే ఎదురుదెబ్బ తగిలే ప్రమాదం ఉందని గ్రహించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. అనుకూలమైన చోట ముందుగా, ప్రతికూలత ఉన్న చోట నిదానంగా ఎన్నికలు నిర్వహించడం ద్వారా నష్ట నివారణకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్ వంటి చోట్ల ఆంధ్ర మూలాలున్న ఓటర్లు అధికంగా ఉండే ప్రాంతాల్లో రాజకీయ సమీకరణాలు ఎప్పుడూ భిన్నంగానే ఉంటాయి. ఈ ప్రాంతాల్లో గెలుపు ఏ పార్టీకైనా ప్రతిష్టాత్మకమే. అందుకే, తక్షణమే ఎన్నికలకు వెళ్లకుండా, అక్కడి ఓటర్లను ఆకట్టుకునేలా ప్రత్యేక అభివృద్ధి పథకాలపై ప్రభుత్వం దృష్టి సారించింది. సైబరాబాద్ పరిధిలో మౌలిక వసతుల కల్పన ద్వారా వారి విశ్వాసాన్ని పొందాకే ఎన్నికల బరిలోకి దిగాలని ప్రభుత్వం భావిస్తోంది. ఎన్నికల వ్యూహంలో భాగంగానే సీఎం రేవంత్ రెడ్డి మూడు కార్పొరేషన్ల పరిధిలో 99 రోజుల ప్రత్యేక అభివృద్ధి కార్యాచరణను ప్రకటించారు. ఈ స్వల్ప కాలంలో పెండింగ్‌లో ఉన్న కీలక ప్రాజెక్టులను పూర్తి చేసి, ఆపై భారీ స్థాయిలో ప్రారంభోత్సవాల ద్వారా ప్రజల్లోకి వెళ్లాలని చూస్తున్నారు. ఒకవైపు పాలనను వికేంద్రీకరిస్తూనే, మరోవైపు అభివృద్ధి పనులతో ప్రత్యర్థుల విమర్శలకు చెక్ పెట్టాలనేది ప్రభుత్వ ఎత్తుగడగా కనిపిస్తోంది. మూడు కార్పొరేషన్లకు వేర్వేరు సమయాల్లో ఎన్నికలు జరపడం ద్వారా.. ఒక ప్రాంతంలో వచ్చిన ఫలితం లేదా ప్రభావాన్ని మరో ప్రాంతంలో తమకు అనుకూలంగా మార్చుకోవచ్చని కాంగ్రెస్ భావిస్తోంది. ఇది ప్రతిపక్షాల ఏకాగ్రతను దెబ్బతీయడంతో పాటు, అధికార యంత్రాంగాన్ని ఒకే చోట కేంద్రీకరించి గెలుపు అవకాశాలను మెరుగుపరుచుకోవడానికి దోహదపడుతుందని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. భాగ్యనగర త్రిశూల వ్యూహంతో మేయర్ పీఠాలను దక్కించుకోవడానికి రేవంత్ రెడ్డి భారీ స్కెచ్ సిద్ధం చేసినట్లు స్పష్టమవుతోంది. ఎంత మేర వర్కవుట్ అవుతాయన్నది వేచి చూడాల్సిందే.

# ఆర్టీసీలో సమ్మె నోటీస్

**హైదరాబాద్, మార్చి 14 :** తెలంగాణ ఆర్టీసీలో సమ్మె సైరన్ మోగింది. తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆర్టీసీ కార్మికులు ప్రభుత్వానికి సమ్మె నోటీసు ఇచ్చారు. విధిలేని పరిస్థితుల్లో సమ్మె నోటీసు ఇచ్చినట్లు జేఏసీ నాయకులు తెలిపారు. ఆర్టీసీ జేఏసీ చైర్మన్ వెంకన్న నేతృత్వంలో ఆర్టీసీ కార్మికులు బస్ భవన్‌లో అధికారులను కలిశారు. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియ వెంటనే చేపట్టాలని ఆర్టీసీ జేఏసీ నేతలు డిమాండ్ చేశారు. అలాగే 2021 వేతన సవరణ 30 శాతం ఫిట్‌మెంట్‌తో అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమ్మె నోటీసులో ఆర్టీసీ కార్మికులు కీలక డిమాండ్లు ప్రస్తావించారు. ప్రభుత్వం మహిళలకు అందిస్తున్న 'మహాలక్ష్మి పథకం కింద ప్రతినెలా అందించే నిధులను కోత లేకుండా ఇవ్వాలన్నారు. ప్రభుత్వ తరుపున ఆర్టీసీకి రావాల్సిన పాత బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఆర్టీసీ కార్మికులకు ఉద్యోగ భద్రత తోపాటు ట్రేడ్ యూనియన్లపై ఆంక్షలు ఎత్తివేయాలన్నారు. అలాగే ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికలు జరపాలని కోరారు. ఇక అన్ని కేటగిరీల్లోని సిబ్బందిపై అధిక పనిభారం తగ్గించాలని జేఏసీ నేతలు డిమాండ్ చేశారు.

# అడగడుగునా అడ్డంకులు... ముందుకు సాగేదెలా

**హైదరాబాద్, మార్చి 14 :** హైదరాబాద్ నగరాన్ని అంతర్జాతీయ స్థాయికి చేర్చాలనే రేవంత్ రెడ్డి సర్కార్ సంకల్పంలో 'మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్' కీలకమైనది. అయితే, ప్రారంభం నుంచీ ఈ ప్రాజెక్టు విమర్శలు, రాజకీయ వివాదాలు, నిర్వాసితుల ఆందోళనల మధ్య నలిగిపోతోంది. ఈ నేపథ్యంలో, అపోహలను తొలగించి, ప్రాజెక్టు పారదర్శకతను చాటిచెప్పేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా రంగంలోకి దిగారు. 500 మంది నిపుణులు, ప్రజాప్రతినిధులతో నిర్వహించే పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఈ ప్రాజెక్టు భవితవ్యాన్ని నిర్ణయించబోయే ఒక కీలక మలుపు. సాధారణంగా ఇలాంటి ప్రాజెక్టుల వివరణను అధికారులు లేదా కన్సల్టెంట్లు ఇస్తారు. కానీ మూసీ ప్రాజెక్టు విషయంలో సీఎం స్వయంగా వివరణ ఇవ్వాలని నిర్ణయించుకోవడం వెనుక బలమైన రాజకీయ, పరిపాలనాపరమైన వ్యూహం ఉంది. బఫర్ జోన్ పరిధిలోని ఇళ్ల కూల్చివేతలు, నిర్వాసితులకు పరిహారం వంటి అంశాలపై ప్రతిపక్షాలు తీవ్ర స్థాయిలో విమర్శలు చేస్తున్నాయి. బాధితుల్లో ఉన్న భయాన్ని తొలగించేందుకు నేరుగా ముఖ్యమంత్రే హామీ ఇస్తున్నారు అనే నమ్మకాన్ని కలిగించడం దీని ప్రధాన ఉద్దేశం. మూసీని లండన్‌లోని థేమ్స్ నది తరహాలో మారుస్తామన్న తన విజన్‌ను ప్రజల్లోకి నేరుగా తీసుకెళ్లడం ద్వారా, అభివృద్ధి నిరోధకులు ఎవరో ప్రజలే తేల్చుకోవాలనే సంకేతాన్ని ఆయన ఇవ్వనున్నారు. ఆసియా అభివృద్ధి బ్యాంకు వంటి అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులను కూడా ఈ సమావేశానికి ఆహ్వానించారు. ప్రాజెక్టు పట్ల ప్రభుత్వానికి ఉన్న స్పష్టమైన రోడ్ మ్యాప్‌ను వారికి వివరించడం ద్వారా నిధుల సమీకరణను సులభతరం చేసుకోవడం మరో లక్ష్యంముఖ్యమంత్రి తన ప్రజెంటేషన్‌లో ఐదు దశల్లో జరగబోయే అభివృద్ధిని వివరించనున్నారు. మొదటి దశలో చేపట్టబోయే పనులు, అందుకు అవసరమైన భూసేకరణ, రక్షణ గోడల నిర్మాణం గురించి క్లారిటీ ఇవ్వనున్నారు. 50 మీటర్ల బఫర్ జోన్ పరిధిలో ఉన్న నిర్మాణాలకు చట్టబద్ధంగా విలువ లేకపోయినా, మానవీయ కోణంలో ఇందిరమ్మ ఇళ్లు, ప్రత్యామ్నాయ స్థలాలు, ఆర్థిక సహాయం అందిస్తామని సీఎం హామీ ఇవ్వనున్నారు. బాపూఘాట్ వద్ద రూ.400 కోట్లతో నిర్మించ తలపెట్టిన 'గాంధీ సరోవర్', నది ఇరువైపులా నిర్మించబోయే ఎకనామిక్ జోన్ల గురించి విడమర్చి చెప్పనున్నారు. ప్రాజెక్టుకు మోక్షం కలగడం అనేది ప్రధానంగా మూడు అంశాలపై ఆధారపడి ఉంటుంది. మేధా పాట్కర్ వంటి సామాజిక కార్యకర్తలు ఇప్పటికే ఈ కార్యక్రమాన్ని వాయిదా వేయాలని కోరుతున్నారు. ప్రజెంటేషన్ తర్వాత నిర్వాసితుల అనుమానాలు పటాపంచలైతేనే క్షేత్రస్థాయిలో పనులు వేగవంతం అవుతాయి. ఈ సమావేశానికి అన్ని రాజకీయ పార్టీల నేతలను ఆహ్వానించారు. ఒకవేళ ప్రతిపక్షాలు సానుకూలంగా స్పందిస్తే ప్రాజెక్టుకు రాజకీయ అడ్డంకులు తొలగుతాయి. లేనిపక్షంలో ఇది కేవలం అధికార పక్ష 'షో'గా మిగిలిపోయే ప్రమాదం ఉంది. కేవలం డిజైన్లు చూపడం కాకుండా, క్షేత్రస్థాయిలో పునరావాస పనులు ఏ మేరకు పకడ్బందీగా జరుగుతాయన్న దానిపైనే ప్రాజెక్టు విజయం ఆధారపడి ఉంటుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ప్రజెంటేషన్ ద్వారా మూసీ ప్రాజెక్టును రాజకీయ వివాదం నుంచి అభివృద్ధి అజెండాగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇది కేవలం ఒక ప్రసంగం కాదు, హైదరాబాద్ భవిష్యత్తుపై ఆయన ఇస్తున్న భరోసా. ఈ వివరణ ప్రజల్లోకి బలంగా వెళ్తే, దశాబ్దాల కాలంగా మురుగు కూపంగా మారిన మూసీకి నిజంగానే పునరుజ్జీవం లభించే అవకాశం ఉంది. ఈ ప్రెజెంటేషన్ ఒక రకంగా మూసీ ప్రాజెక్టుకు అగ్నిపరీక్ష వంటిదని చెప్పవచ్చు.

# శక్తివంతంగా మారుతున్న తెలంగాణ జాగృతి



**హైదరాబాద్, మార్చి 14 :** తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం ఒక అనూహ్య మార్పు కనిపిస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత బీఆర్ఎస్ పార్టీ ప్రధాన నేతలు ఇంకా ప్రతిపక్ష పాత్ర పోషించడంలో కొంత తడబడుతున్నారనే విమర్శలు ఉన్నాయి. తాము ఇంకా సమర్థవంతమైన ప్రతిపక్షంగా మారలేకపోతున్నాం అని గతంలో మాజీ మంత్రి జగదీష్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఈ పరిస్థితికి అద్దం పడుతున్నాయి. అయితే, సరిగ్గా ఇక్కడే కల్వకుంట్ల కవిత తనదైన శైలిలో రాజకీయ దూకుడు పెంచారు. బీఆర్ఎస్ పార్టీ కంటే వేగంగా ఆమె క్షేత్రస్థాయి సమస్యలపై స్పందిస్తూ, ప్రజల్లోకి దూసుకుపోతున్నారు. ముఖ్యంగా ఖమ్మం జిల్లాలోని వెలుగుమట్ల గ్రామంలో పేదల ఇళ్ల కూల్చివేతపై కవిత చేసిన పోరాటం రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు కారణం ?వుతోంది. నిరాశ్రయులైన కుటుంబాల కోసం ఆమె ఏకంగా ఖమ్మం నడిబొడ్డున ఆమరణ నిరాహార దీక్షకు దిగడం, పోలీసుల నిర్బంధాన్ని సైతం లెక్కచేయకుండా పోరాడటం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. బీఆర్ఎస్ కేడర్ అంతా స్తబ్దుగా ఉన్న తరుణంలో, ఆమె నేరుగా గ్రౌండ్ లెవల్‌లోకి వెళ్లి బాధితులకు భరోసా ఇవ్వడం ద్వారా అటు పార్టీ శ్రేణుల్లో, ఇటు ప్రజల్లో ఆమెపై సానుభూతి , మద్దతు పెరుగడానికి కారణం అయింది. ఢిల్లీ లిక్కర్ కేసు నుండి విముక్తి పొందిన కవిత తెలంగాణ జాగృతి వేదికగా తన రాజకీయ పునరాగమనాన్ని అత్యంత శక్తివంతంగా చాటుకుంటున్నారు. తనను పార్టీ నుండి పంపేశారని చెబుతున్న ఆమె చేస్తున్న పోరాటాలు చూస్తుంటే.. బీఆర్ఎస్ చేయలేని పనిని ఆమె ఒంటిచేత్తో చేస్తున్నట్లు కనిపిస్తోంది. కేసీఆర్, కేటీఆర్ వంటి అగ్రనేతలు ఇంకా వ్యూహాల్లో నిమగ్నమై ఉండగా, కవిత మాత్రం నేరుగా యాక్షన్ లోకి దిగడం బీఆర్ఎస్‌కు షాక్ లాంటిదే. కవిత ఇప్పుడు తన 'తెలంగాణ ఉద్యమ కాలం' నాటి పంథాను మళ్లీ ఎంచుకున్నారు. అప్పట్లో జాగృతి ద్వారా ఎలాగైతే ప్రజలను సమీకరించారో, ఇప్పుడు కూడా అదే ఫార్ములాతో వెళ్తున్నారు. చట్టసభల్లో గొంతుక కంటే.. వీధుల్లో చేసే పోరాటమే బలంగా వినిపిస్తుంది అనే సిద్ధాంతాన్ని ఆమె పాటిస్తున్నారు. జగదీష్ రెడ్డి చెప్పినట్లుగా పార్టీ ఇంకా ప్రతిపక్ష పాత్రకు అలవాటు పడకపోవచ్చు కానీ, కవిత మాత్రం ఇప్పటికే ఆ పాత్రలో ఒదిగిపోయారు. ప్రజా సమస్యలపై ఆమె చూపిస్తున్న ఈ తెగువ, కాంగ్రెస్ ప్రభుత్వంపై చేస్తున్న విమర్శలు ఆమెకు ప్రజల మద్దతును మరింత పెంచుతున్నాయి. భవిష్యత్తులో బీఆర్ఎస్ కేడర్ కూడా ఆమె నాయకత్వం వైపు మొగ్గు చూపినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదని చెబుతున్నారు. కేటీఆర్ కూడా వెంటనే.. ప్రెస్మీట్లు, సోషల్ మీడియా విమర్శలకే పరిమితం కాకుడా.. ప్రత్యక్షంగా రాజకీయ యుద్ధాలకు దిగాలన్న అభిప్రాయం బీఆర్ఎస్ క్యాడర్ లో వినిపిస్తోంది.

# టూ టైర్ సిటీల్లో అక్రమ సంబంధాలు

**హైదరాబాద్, మార్చి 14 :** భారతదేశంలో మారుతున్న జీవనశైలికి తగ్గట్టుగానే సంబంధాల విషయంలో కూడా సంచలన మార్పులు చోటు చేసుకుంటున్నాయి. తాజాగా ప్రముఖ డేటింగ్ ప్లాట్‌ఫామ్ ఆష్లే మాడిసన్ విడుదల చేసిన నివేదిక భారతీయుల వ్యక్తిగత సంబంధాలపై విస్తుపోయే నిజాలను వెలుగులోకి తెచ్చింది. ఒకప్పుడు కేవలం మెట్రో నగరాలకే పరిమితమైన వివాహేతర సంబంధాలు, ఇప్పుడు ద్వితీయ శ్రేణి నగరాల్లో కూడా వేగంగా విస్తరిస్తున్నాయని ఈ సర్వే స్పష్టం చేసింది. ఆలయాలకు, పట్టు చీరలకు ప్రసిద్ధి చెందిన తమిళనాడులోని కాంచీపురం ఈ జాబితాలో అగ్రస్థానంలో నిలవడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. గత ఏడాది 17వ స్థానంలో ఉన్న ఈ నగరం.. కేవలం ఒక్క సంవత్సరంలోనే మొదటి స్థానానికి చేరుకుంది. చిన్న పట్టణాల్లో కూడా డేటింగ్ యాప్‌ల వినియోగం ఏ స్థాయిలో పెరుగుతుందో చెప్పడానికి ఇదొక నిదర్శనం. దేశ రాజధాని ప్రాంతం ఈ ప్లాట్‌ఫామ్ వినియోగంలో భారీ రికార్డులను నమోదు చేసింది. సెంట్రల్ ఢిల్లీ రెండవ స్థానంలో ఉండగా, టాప్ 20 జాబితాలో ఢిల్లీకి చెందిన 9 ప్రాంతాలు చోటు సంపాదించుకున్నాయి. గురుగ్రామ్, నోయిడా, ఘజియాబాద్ వంటి నగరాలు కూడా ముందంజలో ఉన్నాయి. ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే దేశ ఆర్థిక రాజధాని ముంబై ఈసారి టాప్ 20 నగరాల జాబితాలో లేకపోవడం గమనార్హం. కాంచీపురం, ఢిల్లీ తర్వాత వరుసగా గురుగ్రామ్, గౌతమ్ బుద్ధ నగర్, డెహ్రాడూన్, పూణే, బెంగళూరు, చండీగఢ్, లక్నో, కోల్‌కతా, హైదరాబాద్ వంటి నగరాలు ఈ జాబితాలో చోటు దక్కించుకున్నాయి. ఇందులో హైదరాబాద్ 11వ స్థానంలో ఉంది. వివాహేతర సంబంధాలను అంగీకరించే వ్యక్తుల రేటు భారత్, బ్రెజిల్‌లో అత్యధికంగా ఉందని, దాదాపు 53శాతం మంది భారతీయులు తమ జీవితంలో ఏదో ఒక సమయంలో ఇటువంటి సంబంధాల్లో పాల్గొన్నారని సర్వే పేర్కొంది. ఎందుకు పెరుగుతున్నాయి.. ఈ పెరుగుదల వెనుక సామాజిక, మానసిక కారణాలు ఉన్నాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు. పని ఒత్తిడి: సుదీర్ఘ పని గంటల వల్ల భాగస్వాముల మధ్య సమయం తగ్గడం. భావోద్వేగ దూరం: సంబంధాల్లో పెరిగిన కమ్యూనికేషన్ గ్యాప్. ఆన్‌లైన్ ప్రైవసీ: డేటింగ్ యాప్‌లు అందించే గోప్యత వల్ల వ్యక్తులు ఇతరులతో రహస్యంగా కనెక్ట్ అవ్వడం సులభమైంది. వ్యక్తిగత స్వేచ్ఛ: ఆధునిక జీవనశైలిలో వ్యక్తిగత స్వేచ్ఛకు ఇస్తున్న ప్రాధాన్యత కూడా ఒక ప్రధాన కారణంగా కనిపిస్తోంది. మొత్తానికి.. ఒకప్పుడు మెట్రో నగరాలకే పరిమితమైన ఈ ధోరణి ఇప్పుడు చిన్న నగరాలకు కూడా పాకిపోవడం సమాజంలో మారుతున్న విలువలకు అద్దం పడుతోంది.

# సారా కథ ఇంతింతకాదయా

మహబూబ్ నగర్, మార్చి 14 : రాజకీయ నాయకులు సాధారణంగా ఓటర్లకు అభివృద్ధి మంత్రం వేస్తారు, కానీ కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి మాత్రం ఏకంగా ఆరోగ్య మంత్రం కనిపెట్టారు. అది కూడా ఎక్కడో విదేశాల్లో కాదు.. మన నాటు సారాలో! ఇప్ప పూవుతో కాచిన సారా తాగితే మనుషులు ఏకంగా 110 ఏళ్లు బతుకుతారని ఆయన సెలవిస్తున్నారు. ఆయన తీరు ప్రపంచ ఆరోగ్య సంస్థ తన హెల్త్ బులిటెన్లను మార్చుకోవాలేమో అన్న అనుమానం కలుగుతోంది. అనిరుధ్ రెడ్డి లాజిక్ ప్రకారం.. ప్రస్తుతం మనం వాడుతున్నవన్నీ కల్తీ వస్తువులే, కానీ ఇప్ప పూవుతో తయారు చేసే సారా మాత్రం స్వచ్ఛమైన ఆర్గానిక్ ప్రొడక్ట్ అట. సారా వల్ల ఆరోగ్యం చెడిపోతుందని నిషేధిస్తే.. ఎమ్మెల్యే గారు మాత్రం అది ఆయుష్షును పెంచే అమృతం అని సర్టిఫికేట్ ఇచ్చేస్తున్నారు. పైగా తాను స్టడీ చేశానని కూడా చెబుతున్నారు. సారా తాగితే ఆరోగ్యం.. 110 ఏళ్ల ఆయుష్షు ఖాయం అని ఒక బాధ్యతాయుతమైన పదవిలో ఉండి ఆయన చెబుతుంటే, నెటిజన్లు మాత్రం సెటైర్లతో విరుచుకుపడుతున్నారు. ఇన్నాళ్లూ ఈ డైట్ ప్లాన్ తెలియక కదా మేము ప్రోటీన్ షేక్స్, గ్రీన్ టీలు తాగి వేస్ట్ అయిపోయాం అని సోషల్ మీడియాలో జోకులు పేలుతున్నాయి. అనిరుధ్ రెడ్డి కనిపెట్టిన ఈ లాంగ్ లైఫ్ సీక్రెట్ విన్నాక, మందుబాబులు కూడా మా ఎమ్మెల్యే గారు మా కోసం ఏదో ఒక కొత్త స్కీమ్ తెస్తారని తెలుసు.. కానీ ఇది మరీ అదిరిపోయింది అని మురిసిపోతున్నారు. అనిరుధ్ రెడ్డి తెలంగాణలో నిషేధించిన సారాను తీసుకు రావాలని డిమాండ్ చేస్తున్నారు. అసెంబ్లీలో కూడా మాట్లాడతానని అంటున్నారు. ఆయన మాటలు నమ్మి ఎవరైనా రేపటి నుంచి 'ఆర్గానిక్' పేరుతో సారా బాటిళ్లకు అతుక్కుపోతే, వారి జీవితం 110 ఏళ్ల దాకా వెళ్తుందో లేదో తెలియదు కానీ, వారి లివర్ మాత్రం త్వరగానే సెలవు తీసుకుంటుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అనిరుధ్ రెడ్డి గారు తన సారా పురాణం తో కాంగ్రెస్ పార్టీలో కూడా సెంటర్ ఆఫ్ అట్రాక్షన్ అయ్యారు. మరి ఈ ఆర్గానిక్ సారా ఫార్ములాను ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తుందా? లేక ఎమ్మెల్యే గారి వ్యక్తిగత హెల్త్ టిప్‌గా మాత్రమే మిగిలిపోతుందా? అనేది చూడాలి.

Edited, Published and Owned by **Ramancharla Srikanth** & Printed by **V. Raj Kumar** at **RK PRINTERS**, # 1-7-210/2, Kamala Nagar, Opp ECIL Bus Stop, ECIL, Hyderabad, Telangana - 500062 & Published from Sri Lakshmi Narsimha Colony, Flat No.106. Balaji Nagar, Kapra, Medchal Dist., Telangana - 500087. **RNI No.: TELTEL/2023/90269**. Editor: **RAMANCHARLA SRIKANTH**, Mob: **9963708331**, Email: telanganashaan331@gmail.com